

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | శుక్రవారం 30-7-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 291 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# సినారె జయంతి : నివాళులర్పించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 29:జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, డాక్టర్ సినారె ( సింగిరెడ్డి నారాయణ రెడ్డి) జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆయనకు నివాళులు అర్పించారు. కవిగా, సినీగేయ రచయితగా, పలు సాహితీ ప్రక్రియలను కొనసాగించి తెలుగు సాహిత్యాన్ని సినారె పరిపుష్టం చేశారన్నారు.

గజల్ వంటి ఉర్దూ సాహితీ సాంప్రదాయానికి గౌరవమిచ్చి, తెలంగాణ సాహిత్యాన్ని గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలిపారని సీఎం గుర్తుచేసుకున్నారు. రాజ్యసభ సభ్యునిగా, వివిధ యూనివర్శిటీలకు వైస్ చాన్సలర్‌గా, ఆయన చేసిన సేవలు విలువైనవన్నారు. కరీంనగర్ బిడ్డగా తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన డాక్టర్ సినారె, తెలంగాణ భాష, సాహిత్య రంగానికి చేసిన సేవ చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. సీ నారాయణ రెడ్డి సాహితీ సేవలకు గుర్తుగా హైదరాబాద్‌లో 'సినారె సారస్వత సదనం' నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు.

# సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి పెద్దపీట : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , జులై 29:హైదరాబాద్ ఈ-సిటీలో సౌర పరికరాల ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రీమియర్ ఎనర్జీస్ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రీమియస్ ఎనర్జీస్‌ను ప్రారంభించారు. పీవీ సెల్స్, మాడ్యూల్స్‌ను ప్రీమియస్ ఎనర్జీస్ ఉత్పత్తి చేస్తుంది. రూ. 483 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టును ప్రీమియస్ ఎనర్జీస్ ఏర్పాటు చేసింది. రెండేళ్లలో పెట్టుబడులను రూ. 1200 కోట్లకు పెంచనున్నట్లు ప్రీమియస్ ఎనర్జీస్ వెల్లడించింది.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పీవీ సెల్స్, మాడ్యూల్స్ ఉత్పత్తిని ప్రారంభించిన ప్రీమియస్ ఎనర్జీస్‌కు అభినందనలు తెలిపారు. 18 నెలల్లోనే సౌర పరికరాల ఉత్పత్తి ప్లాంట్ ప్రారంభించారు. 700 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించినందుకు అభినందనలు తెలిపారు. ఉపాధి కల్పన ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాల్ అని పేర్కొన్నారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీల నియామకం చేపడుతున్నామని చెప్పారు. ప్రయివేటు రంగంలో పెట్టుబడుల ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఏడేళ్లలో రాష్ట్రానికి 15 వేలకు పైగా పరిశ్రమలు రాగా, సుమారు రూ. 2.20 లక్షలకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. 80 శాతానికి పైగా పరిశ్రమలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు.

# సాహితీ ప్రపంచంలో సినారెది ప్రత్యేక స్థానం: ఉపరాష్ట్రపతి వెంకయ్య

న్యూఢిల్లీ, జులై 29: ప్రముఖ కవి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సినారె 90వ జయంత్రి సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాళులర్పించారు. సాహితీ ప్రపంచంలో సినారెది ప్రత్యేక స్థానమని, ఆయన రచనలు పాత తరానికి, కొత్త తరానికి వారధి వేశాయన్నారు. తెలుగు కవుల్లో సినారెను ఎంతగానో అభిమానిసానని అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సినారె సుసంపన్నం చేశారని పేర్కొన్నారు. సినారెను తెలుగుజాతి తరతరాలు గుర్తుపెట్టుకుంటుందని చెప్పారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి ట్వీట్ చేశారు.'ప్రముఖకవి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) గారి 90వ జయంతి సందర్భంగా ఆ సాహితీమూర్తి స్మృతికి నివాళులు అర్పిస్తున్నాను. సాహితీ ప్రపంచంలో వారి స్థానం ప్రత్యేకమైనది. నేను అత్యంత అభిమానించే తెలుగు కవుల్లో సినారె తొలి వరుసలో ఉంటారు. రాజసం, ఠీవీ, గాంభీర్యం, లాలిత్యం, మాధుర్యం, శృంగారాల మేళవింపుగా సాగిన వారి రచనలు పాత తరానికి, కొత్త తరానికి వారధి వేశాయి. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, సినిమా సాహిత్యానికి సైతం గౌరవాన్ని సంపాదించిపెట్టిన సినారె గారిని తెలుగుజాతి తరతరాలు గుర్తు పెట్టుకుంటుంది' అని వెంకయ్య ట్విట్టర్ ద్వారా నివాళులర్పించారు.

# ఉచిత విద్యుత్ పథకం అమలుపై సీఎస్ సోమేశ్ కుమార్ సమీక్ష

హైదరాబాద్ , జులై 29:రాష్ట్రంలోని నాయి బ్రాహ్మణులకు, రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయం విదితమే. అయితే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు.. ఉచిత విద్యుత్ పథకం అమలుపై అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ బీఆర్కే భవన్‌లో సమీక్ష నిర్వహించారు.

ఈ పథకం కింద ఇప్పటి వరకు 28,550 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు సీఎస్ వెల్లడించారు.

ఇందులో 10,637 ధరఖాస్తులు రజకుల కమ్యూనిటీ నుండి, 17,913 ధరఖాస్తులు నాయిబ్రాహ్మణుల కమ్యూనిటీ నుండి వచ్చాయన్నారు. అయితే ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారులు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి జిల్లా కలెక్టర్లు, బీసీ సంక్షేమ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులు తమ ధరఖాస్తులను ఉచితంగా మీ సేవా కేంద్రాలలో నమోదు చేసుకునేలా సౌకర్యాన్ని కల్పించాలని ఐటీ అధికారులను ఆదేశించారు. సీజీజీలో నమోదు చేసుకున్న దరఖాస్తులను వెంటనే సంబంధిత డిస్కంలకు పంపించాలని ఆదేశించారు. తద్వారా ఉచిత విద్యుత్ పథకాన్ని పొందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామ కృష్ణారావు, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, విద్యుత్,



పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రఘునందన్ రావు, ఖూాఖఆఅఒ, అఓఆ రఘుమారెడ్డి, బీసీ వెల్ఫేర్ అడిషనల్ సెక్రటరీ సైదా, వాషర్ మెన్ ఎండీ చంద్రశేఖర్, నాయి బ్రాహ్మణ్ ఎంసీ విమలతో పాటు తదితర అధికారులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే



హైదరాబాద్ , జులై 29:హుజురాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే అని టీఆర్ఎస్ ఎన్నారై వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం అన్నారు.

ఎన్నారై టీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, లండన్ కార్యవర్గ సభ్యులతో కలిసి హుజురాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ.. రాబోయే ఉపఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ అభ్యర్థిని భారీమెజారిటీ తో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నది.

ప్రతిపక్షాలుమాత్రం వారి రాజకీయ లబ్ధికోసం నీతిమాలిన విమర్శలు చేస్తున్నారని అనిల్ మండిపడ్డారు. సీఎం కేసీఆర్ నాయకత్వం ఉంటేనే రైతుబంధు, దళితబంధు లాంటి కార్యక్రమాలు మరెన్నో వస్తాయన్నారు. లేదంటే ప్రతిపక్షాలకు అవకాశమిస్తే అన్ని బంద్ అవుతాయని ప్రజలకు వివరించారు.

# కేరళలో మళ్లీ పూర్తిస్థాయి లాక్‌డౌన్!

తిరువనంతపురంజులై 29: : కొవిడ్ కేసుల పెరుగుదల నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు సంపూర్ణ లాక్‌డౌన్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 31, ఆగస్ట్ ఒకటో తేదీల్లో రెండు రోజుల పాటు లాక్‌డౌన్ అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. గత రెండు రోజులుగా రాష్ట్రంలో కరోనా కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో మహమ్మారి వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు శని, ఆదివారాల్లో లాక్‌డౌన్‌ను విధించింది. మంగళ, బుధవారాల్లో వరుసగా కేరళలో 20వేలకుపైగా పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. దేశంలో నమోదైన కేసుల్లో దాదాపు సగం కేసులు కేరళలోనే ఉన్నాయి. బుధవారం కొత్తగా 22,056 కరోనా కేసులు, 131 మరణాలు నమోదయ్యాయి. దీంతో ఆ రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 33,27,301కు పెరగ్గా.. ఇందులో 31,60,804 మంది కోలుకున్నారు. మరణాల సంఖ్య 16,457కు చేరింది. ప్రస్తుతం 1,49,534 యాక్టివ్ కేసులు ఉన్నాయని ఆరోగ్యశాఖ తెలిపింది.

# మమతా బెనర్జీని కలిసిన డీఎంకే ఎంపీ కనిమోళి



న్యూఢిల్లీ, జులై 29: పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని, తమిళనాడులోని అధికార డీఎంకే ఎంపీ కనిమోళి గురువారం ఢిల్లీలో కలిశారు. టీఎంసీ ఎంపీ అభిషేక్‌బెనర్జీ నివాసంలో ఆమెతో సమావేశమయ్యారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కతాటిపైకి రావాలన్న అంశంతోపాటు పెగాసస్ వివాదంపై వారిద్దరూ చర్చించినట్లు సమాచారం. కేంద్రంలో బీజేపీని అడ్డుకునేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి మూడవ ఫ్రంట్‌ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నది. అయితే దీనికి ఒక రూపు ఇచ్చేందుకు మమతా బెనర్జీ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ టూర్ సందర్భంగా పలువురు ప్రతిపక్ష పార్టీల ప్రముఖులతో ఆమె భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో బుధవారం మమత సమావేశమయ్యారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన మరి కొందరు నేతలతో కూడా ఆమె సమావేశం కానున్నారు.

# కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ

హైదరాబాద్ , జులై 29: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కు తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. శ్రీశైలంలో ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి తెలంగాణకు అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని విడుదల చేయకుండా ఆపాలని కోరింది. త్రిసభ్య కమిటీ అనుమతి లేకుండా నీటి విడుదల చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో గరిష్ట విద్యుత్ ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలి. పులిచింతలలో గరిష్ట విద్యుత్ ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలని కోరింది. ఎత్తిపోతల పథకాలు, బోర్లకు విద్యుత్ ఉత్పత్తి అవసరమని పేర్కొన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలను గంపగుత్తగా కేటాయింపులు చేసింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా ధృవీకరించింది.

రెండు రాష్ట్రాల మధ్య పునఃకేటాయింపుల అంశంపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ జరుపుతున్నందున 2021-22 జల సంవత్సరం నుంచి 50 :50 నిష్పత్తిలో నీటి పంపకాలు జరపాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. బేసిన్‌లో ఉండే ప్రాంతాల అవసరాలు తీరిన తర్వాతనే బేసిన్ అవతల ఉండే ప్రాంతాలకు నీటిని తరలించడానికి అనుమతించాలని కేఆర్ఎంబీని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

# మెడికల్ కోర్సుల్లో రిజర్వేషన్లు.. ఓబీసీలకు 27, ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం

న్యూఢిల్లీ, జులై 29: ఆలిండియా కోటా స్కీమ్ కింద మెడికల్, డెంటల్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఓబీసీలకు 27 శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. ఈ రిజర్వేషన్లు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, బీడీఎస్, ఎండీఎస్, డిప్లొమా మెడికల్ కోర్సుల్లాంటి అన్నింటికీ వర్తిస్తాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా సోమవారం ప్రధాని మోదీ కేంద్ర మంత్రులను కోరారు.

బుధవారం పలువురు బీజేపీ ఎంపీలు, ఓబీసీ కమ్యూనిటీ సభ్యులు కూడా మోదీని కలిసి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ నిర్ణయం ఎంబీబీఎస్‌లోని 1500 మంది ఓబీసీలు, 550 ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు.. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న 2500 మంది ఓబీసీలు, 1000 మంది ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు మేలు చేయనుందని ఆరోగ్య శాఖ చెప్పింది. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలు ఇక నుంచి ఈ ఆలిండియా కోటా స్కీమ్ కింద ఉన్న ఈ రిజర్వేషన్లపై ఏ రాష్ట్రంలో అయినా సీట్ల కోసం పోటీ పడవచ్చని తెలిపింది.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే మాణిక్యరావు



న్యాల్కల్, జులై 29:: పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్యరావు అన్నారు. గురువారం మండలంలోని న్యామతాబాద్ గ్రామ శివారు సన్రైజ్ ఫంక్షన్ హాల్‌లో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేదలకు మూడు పూటలా అన్నం పెట్టేందుకు ప్రభుత్వం మండలానికి 467 రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, తహసీల్దార్ రాధా బాయి, డిప్యూటీ తహసీల్దార్ విజయ కుమార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి. సర్పంచులు మారుతి యాదవ్, మల్లారెడ్డి, పీటర్, కుతుబుద్దీన్, చంద్రన్న, ఎంపీటీసీలు దేశెట్టి పాటిల్, చంద్రన్న, నాయకులు పాండురంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజ్ కుమార్, షబ్బీర్ ఖాన్, నిరంజన్ రెడ్డి, ఈశ్వర్, భూమా రెడ్డి డి, శేఖర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



(జులై 30 అల్లు రామలింగయ్య పుణ్యతిథి..)



-రాధశ్రీ
సెల్: 9494481210




# పోస్ట్-కోవిడ్ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న ప్రజలు

కరోనా కల్లోలానికి ప్రపంచ మానవాళి అతలాకుతలం అయిపోయింది. నేటికి ప్రపంచవ్యాప్తంగా 19.4 కోట్ల మందికి కోవిడ్-19 సోకడం, అందులో 41.6 లక్షల మంది మరణించడం చూస్తుండగానే జరిగి పోయింది. ఇండియాలో 3.15 కోట్ల కరోనా కేసులు, 4.22 లక్షల కోవిడ్-19 మరణాలు నమోదు అయ్యాయి. కరోనాకు సరైన చికిత్స ఏదీ లేకపోవడంతో ప్రాణాలు కాపాడాలనే ఏకైక లక్ష్యంతో వైద్య నిపుణులు అన్ని విధాలుగా కోవిడ్-19 రోగులపై ప్రయోగాలు చేయడం, స్టెరాయిడ్లు వాడడం, ఇతర ఖరీదైన ఔషధాలు వినియోగించడం జరిగింది. కోవిడ్-19 సోకిన దురదృష్టవంతులు కొన్న వారాల చికిత్సలతో ప్రాణాలు కాపాడుకోగలిగారు. కొంత మందిలో కోవిడ్-19 లక్షణాలు కనిపించకుండా 'ఎసిమ్టమాటిక్' కేసులుగా కరోనా సోకడం, నయం కావడం తెలియకుండానే జరిగిపోయాయి. కోవిడ్-19 నుంచి కోలుకున్నామనే సంతోషం కొన్ని రోజుల్లోనే హరించుకుపోయి, 23 శాతం మందిలో పలు రకాల తీవ్ర దుష్ప్రభావాలు బయట పడుతున్నాయి. కోవిడ్ అనంతర అనారోగ్య లక్షణాలు మహిళల్లో 53 శాతం, పురుషుల్లో 47 శాతం నమోదు అయ్యాయి. కోవిడ్-19 లక్షణాలు కలిగిన వారితో పాటుగా ఎసిమ్టమాటిక్ కేసులు కూడా కోవిడ్-19 అనంతర అనారోగ్యాలతో బాధ పడటం నమోదైంది. కోవిడ్-19 అనంతర అనారోగ్యాలలో దీర్ఘ కోవిడ్ (లాంగ్ కోవిడ్), సుదూర-కోవిడ్ (లాంగ్-హాల్ కోవిడ్), తీవ్ర కోవిడ్ (పోస్ట్-అక్యూట్), దీర్ఘకాల ప్రభావ కోవిడ్ (లాంగ్-టర్మ్ ఎఫెక్ట్ కోవిడ్) అనారోగ్యాలను గమనించారు.

కోవిడ్-19 అనంతర అనారోగ్య లక్షణాలలో శ్వాసకోశలో ఇబ్బందులు, అలసట, ఏకాగ్రత లోపం, దగ్గు, కండరాల/కీళ్ళ/ఛాతి/తల/ఒంటి/వెన్ను నొప్పులు, గుండె వేగంగా కొట్టుకోవడం, అతిసారం, నిద్ర లేమి, జ్వరం, జీర్ణాశయాంతర వ్యవస్థ లోపాలు, మహిళలకు రుతుస్రావ మార్పులు, మానసిక అస్థిరత, దురద, బిపి/షుగర్ స్థాయిల్లో మార్పులు, జ్ఞాపక శక్తి తగ్గడం, ఆందోళన, కళ్ళకు చీకట్లు కమ్మడం, శారీరక బలహీనత లాంటివి సాధారణంగా కనిపిస్తున్నాయి. కోవిడ్-19 కబంధహస్తాల నుంచి బయట పడిన వారిలో 20 శాతం మందికి కోవిడ్ అనంతర నొప్పులు, వాపులు కనిపించాయి. కోవిడ్-19 అనంతరం వారాలు, మాసాలుగా కనిపించిన రోగ లక్షణాలలో 'మల్టీ-ఆర్గాన్ ప్రభావం' లేదా 'ఆటో-ఇమ్యున్ కండీషన్ల'తో గుండె దడ, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, ఆకలి మందగించడం, అజీర్ణం, చర్మం, మెదడు లాంటి ముఖ్య అవయవాలు ప్రభావితం అవుతూ, రోగులను భయపెడుతున్నాయి. ఇలాంటి పోస్ట్-కోవిడ్ రోగ లక్షణాలతో పాటు కరోనా లాక్‌డౌన్‌లు, కర్ఫ్యూలు, కట్టుబాట్ల మధ్య ఐసోలేషన్లు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగఉపాధుల కోతలు, జీతంలో కోతలు లాంటి ఇతర అంశాలు కూడా కోవిడ్ అనంతర మానసిక, శారీరక అనారోగ్యాల తీవ్రతలను రెట్టింపు చేయడం చూస్తున్నాం.

కోవిడ్-19 అలలతో ఆసుపత్రి పాలైనవారు, దీర్ఘకాలం చికిత్సలు తీసుకున్నవారు కోవిడ్ అనంతరం అతి జాగ్రత్తగా ఉండాలి. రెండు డోసుల టీకాలు తీసుకున్న వారిలో 57 శాతం కోవిడ్ అనంతర అనారోగ్యాలు సమసిపోవడం, 24 శాతంలో ఏ మార్పు లేకపోవడం, 19 శాతం తొలి టీకాతో అనారోగ్య లక్షణాలు పెరగడం పరిశీలించారు. కోవిడ్ అనంతరం 40 శాతంలో తొలి నెలలో, 22 శాతంలో 1-3 మాసాలు, 10 శాతంలో 3 నెలలకు వరకు దుష్ప్రభావాలు కనిపించాయి. కోవిడ్-19 నుంచి కోలుకున్న ప్రజలు సత్వరమే తప్పనిసరిగా రెండు డోసుల టీకాలను తీసుకోవడం మరువరాదు. కరోనా విధించిన క్రమశిక్షణలైన మాస్కులు, సానిటైజర్లు, భౌతిక దూరాలు లాంటివి విధిగా పాటించాలి. వైద్యుల సలహాలు తీసుకుంటూ, విశ్రాంతి తీసుకుంటూ, మానసిక దృఢత్వంతో ఆరోగ్యాన్ని తిరిగి చేజిక్కించుకునే ప్రయత్నం చేయాలి. కరోనా సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం, కోవిడ్-19 బారిన పడినప్పటికీ త్వరగా కరోనా పరీక్షలు చేయించుకొని చికిత్స పొందడం, కరోనా క్రమశిక్షణలు పాటించడం, మరో కరోనా అలలో చిక్కకుండా ప్రతి ఒక్కరు ముందు జాగ్రత్తలు తీసుకుంటూ కరోనా కట్టడికి కంకణ బద్ధులు కావాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## 2022 మూడో త్రైమాసికంలో చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టే అవకాశం: డా.జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 29:కరోనా భయం తొలగిపోయి సాధారణ పని సరళి కొనసాగుతుందన్న అంచనాలతో, 2022 మూడో త్రైమాసికంలో చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టే అవకాశం ఉందని కేంద్ర అణు శక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) డా.జితేంద్ర సింగ్ వెల్లడించారు. చంద్రయాన్-3ని సాక్షాత్కరింపజేసే ప్రక్రియ కొనసాగుతోందని లిఖితపూర్వక సమాధానంగా ఇవాళ లోక్‌సభకు వెల్లడించారు.

అనుసంధాన ప్రక్రియల ఖరారు, ఉప వ్యవస్థలను గాడిలో పెట్టడం, ఏకీకరణ, అంతరిక్ష నౌక స్థాయి సంపూర్ణ పరీక్ష, భూమిపై వ్యవస్థ పనితీరును అంచనా వేసేందుకు అనేక ప్రత్యేక పరీక్షలు సహా వివిధ విధానాలను చంద్రయాన్-3 ప్రయోగం కలిగి ఉంటుంది. కొవిడ్ కారణంగా ఈ ప్రక్రియలన్నీ దెబ్బతిన్నాయి. లాక్‌డౌన్ సమయంలో ఇంటి నుంచి చేయగలిగిన విధులన్నింటినీ ఉద్యోగులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. అన్‌లాక్ తర్వాత నుంచి చంద్రయాన్-3 పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అవన్నీ ముగింపు దశలో ఉన్నాయి.

## రహదారుల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం

న్యూఢిల్లీ, జులై 29:ఇప్పటివరకు 703 పొడవైన జాతీయ రహదారుల నిర్మాణంలో, పైపొర మిశ్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించారు. జాతీయ రహదారుల పేవ్‌మెంట్ల కాలానుగుణ మరమ్మతులలో ప్లాస్టిక్ వ్యర్థాలను తప్పనిసరిగా ఉపయోగించాలని, 5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణ ప్రాంతాలకు 50 కిలోమీటర్ల పరిధిలో నిర్మించే సర్వీస్ రోడ్లలోనూ ఉపయోగించాలని మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. రహదారుల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వల్ల, పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు తప్పుతుంది.

కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈ సమాచారాన్ని లిఖితపూర్వక సమాధానంగా ఇవాళ లోక్‌సభకు సమర్పించారు.

## ఈటలను ఓడించండి: హుజురాబాద్ ప్రజలకు మోత్కుపల్లి పిలుపు

హైదరాబాద్ , జులై 29:దళిత బంధును అడ్డుకునేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. దళితులు బాగుపడితే బానిసలుగా ఉండరని భావిస్తున్నారని, అఖిలపక్షం దళిత బంధును స్వాగతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హుజూరాబాద్ ఉపఎన్నికలో టీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని దళితులకు పిలుపు ఇచ్చారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ అవినీతిపరుడని, పదవిని అడ్డం పెట్టుకుని 700 ఎకరాల భూమి సంపాదించారని ఆరోపించారు. 40 ఎకరాలు దళితుల అసైన్డ్ భూమని ఆయనే చెప్పారని, ఆ భూమిని వెంటనే వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈటలను ఎన్నికల నుంచి బహిష్కరించాలని చెప్పారు. ఉప ఎన్నికలో ఈటలను ఓడించాలని మోత్కుపల్లి పిలుపునిచ్చారు.

## కొండగట్టులో నవీన్ మిట్టల్ ప్రత్యేక పూజలు



కొండగట్టు/జగిత్యాల, జులై 29: : రాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యా కళాశాల కమిషనర్ నవీన్ మిట్టల్ సతీసమేతంగా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యే పూజలు చేశారు. ఆలయ వర్గాలు నవీన్ మిట్టల్‌కు ఘన స్వాగతం పలికాయి. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ జి.రవి నవీన్ మిట్టల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛని అందజేశారు.

## వెనుకబడిన తరగతులను గుర్తింపు మరియు జాబితా తయారీ హక్కు

న్యూఢిల్లీ, జులై 29:రాజ్యాంగ (వంద మరియు రెండవ) సవరణ చట్టం 2018 భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 342-ఎ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన ఆయా తరగతుల కేంద్ర జాబితాకు సంబంధించిన.. (ఎస్ఈబీసీలు - సాధారణంగా ఇతర వెనుకబడిన తరగతులు - ఓబీసీలు) అధికారాన్ని ఇచ్చింది. ఒక నిర్దిష్ట రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి ఎస్ఈబీసీల కేంద్ర జాబితాను పేర్కొనడానికి రాష్ట్రపతికి అధికారాన్ని ఇచ్చింది. దీనికి తోడు ఎస్ఈబీసీల (ఓబీసీ) కేంద్ర జాబితాలో ఏదైనా సవరణ ఉంటే దానిని పార్లమెంటు ద్వారా మాత్రమే చేయవచ్చు. గౌరవ సుప్రీంకోర్టు డబ్ల్యు.పి. 938/2020, 5లీ మే 2021న, రాజ్యాంగం (వంద మరియు రెండవ) సవరణ చట్టం 2018ను వ్యాఖ్యానించింది మరియు రాష్ట్రపతి పేర్కొన్న జాబితా రాజ్యాంగంలోని అన్ని ప్రయోజనాల కోసం ఎస్ఈబీసీల (ఓబీసీలు) యొక్క ఒకే జాబితాగా మాత్రమే ఉండాలని ఆదేశించింది. ప్రతి రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతానికి వారి ఎస్ఈబీసీల జాబితాను ప్రచురించే అధికారం రాష్ట్రాలకు లేదు. సవరణ అమలుకు ముందు పార్లమెంటులో జరిగిన చర్చ ప్రతిబింబించే విధంగా గౌరవనీయమైన సుప్రీంకోర్టు యొక్క పై తీర్పు.. శాసన ఉద్దేశాన్ని తన పరిగణనలోకి తీసుకోలేదు, ఇక్కడ ఈ సవరణ గుర్తించడానికి మరియు రాష్ట్రాల అధికారాలకు ఆటంకం కలిగించదని నిస్సందేహంగా ప్రకటించబడింది. అందువల్ల తీర్పును పునఃపరిశీలించాలని ఒక సమీక్ష పిటిషన్ కూడా దాఖలైంది, కాని అది కొట్టివేయబడింది. ప్రభుత్వం న్యాయ నిపుణులు, న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతోంది మరియు ఆయా రాష్ట్రాల కొరకు ఓబీసీల యొక్క రాష్ట్ర జాబితాను నిర్ణయించడంలో రాష్ట్రాల శక్తిని కాపాడే మార్గాలను పరిశీలిస్తోంది.

# జాతీయ విద్య విధానం- 2020 ఒకటో వార్షికోత్సవానికి గుర్తుగా అనేక కీలక కార్యక్రమాలను ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 29:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'జాతీయ విద్య విధానం-2020' లో భాగం అయిన సంస్కరణల కు ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భాని కి గుర్తు గా 2021 వ సంవత్సరం న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా దేశం లోని విద్యార్థుల ను, గురువుల ను, విద్య, నైపుణ్య వికాసం సంబంధి క్షేత్రానికి చెందిన విధాన రూపకర్తల ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. విద్య రంగం లో అనేక కార్యక్రమాల ను కూడా ఆయన ప్రారంభించనున్నారు.

విద్యార్థుల కు ఉన్నత విద్య లో ప్రవేశం, నిష్క్రమణ ల పరంగా బహుళ అయిచ్ఛికాల ను అందించే ఎకేడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ ను ప్రధాన మంత్రి కార్యక్రమం లో ప్రారంభిస్తారు. దీని తో పాటు, ప్రాంతీయ భాషల లో ఒకటో సంవత్సరం ఇంజినీరింగ్ కార్యక్రమాలను, ఉన్నత విద్య అంతర్జాతీయ కరణ కు సంబంధించినటువంటి మార్గదర్శక సూత్రాల ను కూడా ప్రధాన మంత్రి జారీ చేస్తారు.

ప్రధాన మంత్రి ప్రారంభించనున్న కార్యక్రమాలలో.. 'విద్య ప్రవేశ్' కూడా ఒకటి గా ఉంటుంది. ఇది గ్రేడ్ వన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన మూడు నెలల నాటకాధారిత పాఠశాల సన్నాహక మాడ్యూల్; మాధ్యమిక స్థాయి లో ఒక విషయం గా భారతీయ సంజ్ఞా భాష; ఎన్‌సిఇఆర్‌ టి రూపొందించిన ఉపాధ్యాయ శిక్షణ సంబంధిత ఏకీకృత కార్యక్రమం- ఎన్ఐఎస్ హెచ్ టిహెచ్ఎ 'నిశిత 2.0'; ఎస్ఎఎఫ్ఎఎల్- 'సఫల్' (స్ట్రక్చర్ డ్ అసెస్ మెంట్ ఫార్ ఆనలైజింగ్ లర్నింగ్ లెవెల్స్) ; సిబిఎస్ఇ పాఠశాలల్లో 3వ, 5వ, 8వ గ్రేడు ల కోసం ఉద్దేశించినటువంటి యోగ్యత ఆధారితమైన మూల్యాంకన స్వరూపం లతో పాటు ఆర్టిఫిశియల్ ఇంటెలిజెన్స్ కు అంకితం అయ్యే ఒక వెబ్ సైట్.. లు కూడా ఉన్నాయి.ఇంకా, నేశనల్ డిజిటల్ ఎడ్యుకేశన్ ఆర్కిటెక్చర్ ఎన్ డిఇఎఆర్, నేశనల్ ఎడ్యుకేశనల్ టెక్నాలజీ ఫోరమ్ (ఎన్ఇటిఎఫ్) లను కూడా ఇదే కార్యక్రమం లో ప్రారంభించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమాలు జాతీయ విద్య విధానం (ఎన్ఇపి) 2020 లక్ష్యాల ను సాధించే దిశ లో ఒక ముఖ్యమైన అడుగు గా ఉండబోతున్నాయి. విద్య రంగం మరింత చైతన్య భరితం గా, మరింత మంది కి అందుబాటు లో ఉండేటట్లు గా ఈ కార్యక్రమాలు తోడ్పడనున్నాయి.

ఒక 'ఆత్మ నిర్భర్ భారత్' ను ఆవిష్కరించడం కోసం బలమైన పునాదుల ను నిర్మించడానికి జ్ఞానార్జన మౌలిక స్వరూపం లో మార్పుల ను తీసుకు రావడం కోసం విద్య ను సమగ్రమైంది గా తీర్చిదిద్దడానికి మార్గదర్శక విధానంగా ఎన్ఇపి- 2020 ఉంది. ఇది 21 వ శతాబ్ది లో తొలి విద్య విధానం గా కూడాను ఉంది. అంతేకాదు, 34 సంవత్సరాల నాటి పాత నేశనల్ పాలిసి ఆన్ ఎడ్యుకేశన్ (ఎన్ పిఇ) స్థానం లో దీని ని అమలు పరుస్తున్నారు. లభ్యత, సమానత, నాణ్యత, తక్కువ ఖర్చు తో కూడిన, జవాబుదారీతనం కలిగిన అనే పునాదుల మీద రూపు ను దిద్దుకొన్నటువంటి ఈ విధానాన్ని సుస్థిర అభివృద్ధి కోసం 2030 కార్యాచరణ ప్రణాళిక తో సంధానించడం జరిగింది. ఇది భారతదేశాన్ని ఒక జాగృతిభరిత జ్ఞాన ప్రధానమైనటువంటి సమాజం గాను, ప్రపంచం లో ఒక మహా జ్ఞాన శక్తి గాను దిద్ది తీర్చడానికి ఉద్దేశించినటువంటి విధానం గా ఉంది. పాఠశాల విద్య ను, కళాశాల విద్య ను మరింత సంపూర్ణమైందిగాను, మార్పు చేర్పుల కు అవకాశం ఉండేదిగాను, బహుళ విభాగాలు కలిగిందిగాను, 21వ శతాబ్దం అవసరాల కు సరిపోయేదిగాను మలచి, ప్రతి ఒక్క విద్యార్థిని లో, ప్రతి ఒక్క విద్యార్థి లో దాగివుండే విశిష్ట సామర్థ్యాల ను వెలికి తీసుకు రావడమే ధ్యేయం గా దీనికి రూపకల్పన చేయడం జరిగింది.

# 'ఇంటర్నేషనల్ టైగర్ డే' నాడు వన్యప్రాణుల ప్రేమికులకు అభినందన -పధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 29:వన్యప్రాణుల ను ప్రేమించే వారి కి, ప్రత్యేకించి పులుల ను సంరక్షించే విషయం లో ఎక్కువ గా మక్కువ ను కనబరచే వారి కి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అంతర్జాతీయ పులుల దినం సందర్భం లో అభినందన లు తెలిపారు.

" ఎనిబివతీనిజీబితీనీనిజీశ్రీతిణవతీఆజీఎ సందర్భం లో వన్యప్రాణి ప్రేమికులకు ప్రత్యేకించి పులుల సంరక్షణ పట్ల ఎక్కువ మక్కువ కలిగినటువంటి వారికి ఇవే అభినందన లు. ప్రపంచం అంతటా ఉన్న వ్యాఘ్రాల సంతతి లో 70 శాతానికి పైగా వ్యాఘ్రాల కు భారతదేశం ఆశ్రయాన్ని ఇస్తోంది. మనం మరొక్క సారి మన పులుల కు సురక్షితమైన ప్రాకృతిక ఆవాసాలు లభించేటట్లుగా చూడడం లో, పులుల కు అనుకూలం గా ఉండేటటువంటి ఇకో-సిస్టమ్ ను ప్రోత్సహించడం లో మన నిబద్ధత ను ఈ సందర్భంలో పునరుద్ఘాటించుదాం.

భారతదేశం లో పులుల కు 51 అభయారణ్యాలు ఉన్నాయి. ఆ అభయారణ్యాలు 18 రాష్ట్రాల లో విస్తరించి ఉన్నాయి. పులుల లెక్కింపు ను కడపటి సారి గా 2018 వ సంవత్సరం లో చేపట్టడం జరిగింది. దాని ద్వారా పులుల సంఖ్య పెరుగుతోందని తేలింది. పులుల సంరక్షణ అంశం లో సెంట్ పీటర్స్ బర్గ్ ప్రకటనపత్రం లో ఖరారు చేసిన కాలపరిమితి ని దృష్టి లో పెట్టుకొని భారతదేశం పులుల సంతతి ని రెండింతలు చేసే లక్ష్యాన్ని నాలుగు సంవత్సరాలు ముందుగానే సాధించింది.

పులుల ను సంరక్షించే అంశం లో భారతదేశం అనుసరిస్తున్నటువంటి వ్యూహం లో స్థానిక సముదాయాల కు అన్నింటి కంటే అధిక ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరుగుతోంది. మనం మన ఈ ఘనమైన గ్రహాన్ని వృక్ష జంతుజాలం తో కలసి పంచుకొంటూ ఉన్నాం; అంతే కాదు, మనం వృక్ష జంతుజాలం పట్ల సామరస్య భావన తో మనుగడ ను



సాగించాల్సివుందని బోధిస్తున్న శతాబ్దాల నాటి మన ప్రాచీన సంప్రదాయాన్నుంచి ప్రేరణ ను కూడా పొందుతున్నాం. " అని ప్రధాన మంత్రి అనేక ట్వీట్ లలో పేర్కొన్నారు.

# అంతరిక్ష కార్యక్రమాల బిల్లును ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోంది- డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 29:అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల నియంత్రణ, ప్రోత్సాహం లక్ష్యంగా అంతరిక్ష కార్యక్రమాల బిల్లును ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ సహాయమంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్) ; ఎర్త్ సైన్సెస్; ఎంఓఎస్ పిఎంఒ, సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్స్, అణుశక్తి, అంతరిక్షం శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ అంతరిక్ష సాంకేతిక అభివృద్ధి, సర్వీసులు, పరికరాల స్వదేశీ ఉత్పత్తిలో మరింత ప్రైవేటు భాగస్వామ్యం ప్రోత్సహించడానికి పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి, ఓ విధానాన్ని ప్రభుత్వం రూపకల్పన చేస్తోందని కేంద్ర మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం 2020 జూన్ లో అంతరిక్ష రంగంలో సంస్కరణలను ప్రకటించింది. భారత దేశంలో ప్రైవేట్ అంతరిక్ష కార్యకలాపాలు ప్రోత్సహించడం, హ్యాండ్‌హోల్డింగ్, లైసెన్సింగ్, అధికారం మరియు పర్యవేక్షణ ఆదేశాలతో అంతరిక్ష శాఖ క్రింద భారత జాతీయ అంతరిక్ష ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) ఒక స్వతంత్ర నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేశారు. డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ (డాస్) సదుపాయాలు మరియు నైపుణ్యం వారి అంతరిక్ష కార్యకలాపాలకు మద్దతుగా ప్రైవేట్ సంస్థలకు విస్తరించారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం కొత్త డొమైన్లలో సవాళ్లను ముందుంచి అందుకు తగ్గ అవకాశాలను ప్రకటించారు. అంతరిక్ష రంగంలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

దీనితో పాటు, కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలు మరియు మార్గదర్శకాలను తీసుకువస్తోంది, ఇప్పటికే ఉన్న విధానాలను సవరిస్తోంది.

ప్రైవేట్ సంస్థలకు ప్రావృతను అనుమతించేటప్పుడు ఇస్రో సంస్థాపనల భద్రతను నిర్ధారించడానికి రూపుదిద్దుకుంటున్న ఇన్-స్పేస్, సేఫ్టీ-సెక్యూరిటీ డైరెక్టరేట్ కలిగి ఉంటుంది. ప్రజా సంప్రదింపులు జరిగాయి, సంబంధిత విభాగాలు, మంత్రిత్వ శాఖలను సంప్రదించారు.

పారిశ్రామికవేత్త / అకాడెమియా / స్టార్ట్-అప్ లతో పాటు సాధారణ ప్రజల భాగస్వామ్యంతో నాలుగు అంతరిక్ష కార్యక్రమాలను కవర్ చేసే నాలుగు సెషన్లతో కూడిన 'అన్లాకింగ్ ఇండియా అంతరిక్ష రంగంలో' ప్రత్యేక వెబ్‌నార్ నిర్వహించారు. అన్ని సూచనలు పరిగణనలోకి తీసుకుని తగు విధంగా తదుపరి చర్యలు చేపట్టడానికి నిర్ణయించారు.

# జమ్మికుంటలో గొర్రెల పంపిణీని ప్రారంభించిన మంత్రులు

కరీంనగర్, జులై 29:హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట మార్కెట్ యార్డులో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. అనంతరం 500 మంది లబ్ధిదారులకు గొర్రె యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణకు సీఎం కేసీఆరే శ్రీరామ రక్ష అని మంత్రులు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చిత్త శుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి.

ఒక్క రాష్ట్రంలో కూడా తెలంగాణ మాదిరి పథకాలు లేవన్నారు. బీజేపీ నాయకులకు దమ్ముంటే గొర్రెల పంపకం వంటి ఒక్క పథకాన్ని అమలు చేయాలని సవాల్ విసిరారు. అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేని దద్దమ్మలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. చేతనైతే సద్విమర్శలు చేయాలని, వ్యక్తి గత దూషణలు సరికావని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రపంచ పులుల దినోత్సవం.. కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్



అమరావతి, జులై 29:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ప్రపంచ పులుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 63 పులుల చిత్రాలతో రూపొందించిన పుస్తకాన్ని, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో అటవీ శాఖ నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అటవీ, పర్యావరణశాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎన్ ప్రతీప్ కుమార్, అటవీ, పర్యావరణశాఖ కార్యదర్శి విజయ్‌కుమార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎడారీకరణను నిరోధించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మద్దతు నిచ్చేందుకు కెవిఐసి, బిఎస్ఎఫ్ చే జైసల్మేర్‌లో బోల్డ్ కార్యక్రమం

న్యూఢిల్లీ, జులై 29:రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాన్ని హరితమయం చేసేందుకు ఉద్దేశించిన ఈ తరహా మొట్టమొదటి కార్యక్రమాన్ని ఖాదీవిలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) సరిహద్దు భద్రతాదళం సహకారంతో మంగళవారం నాడు చేపట్టింది. ఇందులో భాగంగా జైసల్మేర్‌లోని టనోట్ గ్రామంలో వెయ్యి వెదురు మొక్కలు నాటారు.కెవిఐసి ఛైర్మన్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బిఎస్ఎఫ్ స్పెషల్ డిజి (పశ్చిమ కమాండ్) శ్రీ సురేంద్ర పవార్ సమక్షంలో ప్రారంభించారు. ఈ వెదురు మొక్కలునాటే కార్యక్రమాన్ని కెవిఐసి ప్రాజెక్టు అయిన బోల్డ్ ( బ్యాంబూ ఒయాసిస్ ఆన్ ల్యాండ్స్ ఇన్ డ్రాట్)లో భాగంగా నాటారు. ఇది ఎడారీ కరణను నిరోధించడం, గ్రామీణ ప్రజలకు జీవనోపాధిని కల్పించడానికి మద్దతు నిచ్చే జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా దీనిని చేపట్టారు.

వెదురు మొక్కలను తనోత్ గ్రామ పంచాయతికి చెందిన 2.50 లక్షల చదరపు అడుగుల స్థలంలో నాటడం జరిగింది .ఇది భారత పాక్ సరిహద్దు ప్రాంతానికి దగ్గరలోని తనోత్ మాతా ఆలయానికి దగ్గరలా ఉంది. జైసల్మేర్ సిటీకి ఇది 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. తనోత్ రాజస్థాన్ లో అత్యంత ఎక్కువమంది పర్యాటకులు దర్శించే స్థలం. కెవిఐసి తనోత్ వద్ద వెదురు ఆధారిత మొక్కలు నాటడం ద్వారా ఆ ప్రాంతాన్ని హరితమయం చేసి పర్యాటకులకు ఆకర్షణీయ ప్రాంతంగా తీర్చిదిద్దుతోంది. ఈ మొక్కలను నిర్వహించే బాధ్యత బిఎస్ఎఫ్ ది.

ప్రాజెక్ట్ బోల్డ్‌ను జూలై 4న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లా నిచ్ల మనడ్వా గిరిజన గ్రామం నుంచి ప్రారంభించింది. ఇక్కడ 25 బిఘాల భూమిలో 5వేల ప్రత్యేక వెదురు మొక్కలు నాటారు. భూసారాక్షీణతను నిరోధించడం, దేశంలో ఏడారీకరణను తగ్గించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కెవిఐసి వారి ఖాదీ బ్యాంబూ ఫెస్టివల్ లో భాగంగ అలాగే 75 సంవత్సరాల స్వాతంత్ర్యదినోత్సవాలైన ఆజాది కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా దీనిని చేపట్టడం జరిగింది.

జైసల్మేర్ ఎడారి ప్రాంతంలో వెదురు మొక్కలు నాటడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కెవిఐసి ఛైర్మన్ తెలిపారు.అంటే ఎడారీకరణను నిరోధించడం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి నమూనాను చేపట్టడం ఇందులో ఉన్నాయి. గ్రామీణ, వెదురు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా వాటికి మద్దతునిస్తోంది.

రాగల మూడు సంవత్సరాలలో, ఈ వెదురు మొక్కలు కోతకు వస్తాయి. ఇది స్థానిక గ్రామస్థులకు ఆదయ వనరుగా ఉంటుంది. కెవిఐసి పర్యాటక ప్రాంతాన్ని హరితమయం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఎక్కువమంది పర్యాటకులు వచ్చే తనోత్‌మాతా ఆలయం,లోంగోవాలా పోస్ట్ వద్ద హరిత మయం చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు శ్రీ సక్సేనా తెలిపారు. తక్కువ సమయంలోఈ ప్రాజెక్టును అమలు చేయడంలో బిఎస్ఎఫ్ అందిస్తున్నమద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాగల 3 సంవత్సరాలలో వెయ్యి వెదురు మొక్కలు,మరెన్నోరెట్లు పెరిగి 4000 వెదురు మొక్కలుగా విస్తరించి సుమారు 100 మెట్రిక్‌టన్నుల వెదురు ను అందించనుంది. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం వెదురు టన్నుకు 5000 రూపాయలు లభిస్తున్నది. ఈ వెదురు ఉత్పత్తి వల్ల మూడు సంవత్సరాల తర్వాత 5 లక్షల రూపాయలు రాబడి లభించడంతోపాటు ఆతర్వాత ప్రతి సంవత్సరం రాబడి వస్తుంది.ఇది స్థానికులకు ఆదాయ వనరుగా ఉంటుంది.వెదురును అగర్‌బత్తీలలో వాడే పుల్లలకు, ఫర్నిచర్, కళారూపాలు, వాద్య పరికరాలు, పేపర్. పల్ప్‌ను వాడేందుకు వాడుతారు.అలాగే వెదురు వ్యర్థాలను చార్‌కోల్ తయారీ, ఇంధనంగా కూడా వాడుతారు. వెదురు నీటిని పొదుపుగా వాడుకుంటుంది. అందువల్ల కరువుపీడిత ప్రాంతాలలో,పొడి నేలల్లో నాటడానికి పనికివస్తుంది.

## ఏపీలో ఈ నెల 31 నుంచి సినిమా హాళ్లు ఓపెన్..

అమరావతి, జులై 29:ఏపీలో ఈ నెల 31 నుంచి థియేటర్లలో ఓపెన్ కానున్నాయి. కారోనా ఉధృతి నేపథ్యంలో సినిమా హాళ్లు మూసివేశారు. కాగా ఇప్పటికే తెలంగాణలో రేపటి నుంచి సినిమా హాళ్లు తెరుచుకోనున్నాయి. దీంతో ఏపీ ప్రభుత్వం కూడా ఈ నెల 31 నుంచి సినిమా థియేటర్లలో ప్రదర్శనలకు అనుమతి ఇచ్చింది. అయితే, 50 శాతం సీటింగ్ తోనే ప్రదర్శనలు జరుపుకోవాలని స్పష్టం చేసింది. మాస్కులు, శానిటైజర్లు, భౌతికదూరం వంటి కరోనా మార్గదర్శకాలు పాటించడం తప్పనిసరి అని పేర్కొంది. ఇటీవల కర్ఫ్యూ సమయాల సడలింపులు ఇచ్చే సందర్భంలోనే థియేటర్ల రీ ఓపెనింగ్ కు సర్కారు పచ్చజెండా ఊపింది. అయితే, నిర్మాతలతో ఎగ్జిబిటర్ల వివాదం ఓ కొలిక్కిరాకపోవడంతో థియేటర్లు తెరుచుకోవడం ఆలస్యమైంది. కాగా, 50 శాతం సీటింగ్ తో సినిమా ప్రదర్శనలు తమకు లాభదాయకం కాదని థియేటర్ల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

# కట్లాస్ ఎక్స్‌ప్రెస్ -21 విన్యాసంలో పాల్గొన్న ఐఎన్ఎస్ తల్వార్ విబిఎస్ఎస్ శిక్షణను ఇచ్చిన భారతీయ నావికాదళం

న్యూఢిల్లీ, జులై 29: కెన్యాలో జులై 26 నుంచి 06 ఆగస్టు,21 వరకు నిర్వహిస్తున్న బహుళ- జాతీయ నావికాదళ విన్యాసం కట్లాస్ ఎక్స్ ప్రెస్ 2021 (సిఇ 21)లో భారతీయ నావికాదళ నౌక తల్వార్ పాలుపంచుకుంటోంది. మొంబాసాలో జులై 26-28 వరకు నిర్వహించిన హార్బర్ దశలో భారతీయ నావికాదళ కమెండోల బృందం (ఎంఎఆర్‌సిఒఎస్) కెన్యా, జిబౌటీ, మొజాంబిక్, కామెరూన్, జార్జియా కోస్ట్‌గార్డ్ నావికాదళ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. మొంబాసాలోని బందారి మారిటైమ్ అకాడమీలో జరిగిన ఈ విన్యాసం సందర్భంగా విదేశీ నావికాదళ సైనికులతో ఉత్తమ పద్ధతులైన విజిట్, బోర్డ్, సెర్చ్, సీజర్ (వెళ్లడం, అధిరోహించడం, సోదా, స్వాధీనం -విబిఎస్ఎస్) కార్యకలాపాలను ఎంఆర్‌సిఒఎస్ పంచుకుంది.

కట్లాస్ ఎక్స్ ప్రెస్ విన్యాసం ప్రాంతీయ సహకారం, సముద్ర పరిధి పట్ల అవగాహన, యుఎస్, తూర్పు ఆఫ్రికా దేశాలు, పశ్చిమ హందూ మహాసముద్రంలో అక్రమ నావికా కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు యుఎస్, తూర్పు ఆఫ్రికా దేశాలు, పశ్చిమ హందూ మహాసముద్రం దేశాల మధ్య సమాచారం ఇచ్చి పుచ్చుకునే పద్ధతులను మెరుగుపరచడం కోసం రూపొందించారు.

# కోవిడ్ కేసుల ఆకస్మిక పెరుగుదల నేపథ్యంలో కేరళకు ఉన్నతస్థాయి కేంద్ర బృందం

న్యూఢిల్లీ, జులై 29:కేరళలో రోజువారీ కోవిడ్ కేసులు ఒక్కసారిగా మళ్లీ పెరగటం మొదలైంది. దీంతో అక్కడికి ఉన్నత స్థాయి బహుముఖ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కేంద్ర బృందాన్ని పంపాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ బృందం అక్కడి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు అండగా నిలిచి కోవిడ్ నియంత్రణను మరింత పటిష్ఠం చేస్తుంది.

ఆరుగురు సభ్యులతో కూడిన ఈ కేంద్ర బృందానికి జాతీయ వ్యాధి నియంత్రణామండలి ( ఎన్ సి డి ఎస్) డైరెక్టర్ డాక్టర్ ఎస్. కె. సింగ్ నాయకత్వం వహిస్తారు. ఈ బృందం జులై 30న కేరళ చేరుకొని కొన్ని జిల్లాలలో పర్యటిస్తుంది.

ఆ రాష్ట్ర ఆరోగ్య విభాగంతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో తాజా పరిస్థితిని సమీక్షించి అక్కడ ఎందుకు అత్యధికంగా కేసులు పెరుగుతున్నాయో ఒక అవగాహనకు వస్తుంది. అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వటం ద్వారా పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి సహకరిస్తుంది.

కేరళలో ప్రస్తుతం 1.54 లక్షలంది చికిత్సలో ఉండగా యావత్ దేశంలో చికిత్సలో ఉన్నవారిలో వీరు 37.1% ఉండటం సహజంగానే ఆందోళనకరంగా మారింది. పైగా గత ఏడు రోజులలో1.41% పెరుగుదల నమోదైంది. సగటున రోజుకు 17,443 కి పైగా కేసులు వస్తుండగా 12.93% పాజిటివిటీ చొప్పున నమోదవుతూ మొత్తం వారానికి 11.97% పాజిటివిటీ నమోదైంది. 6 జిల్లాల్లో 10% పైగా వారపు పాజిటివిటీ గుర్తించారు.

# నన్ను ఓడగొట్టే దమ్ములేక చిల్లర రాజకీయాలు: ఈటల

హైదరాబాద్ , జులై 29:తెలంగాణ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని హుజురాబాద్ నియోజకవర్గం నుంచి ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. తనను ఓడగొట్టే దమ్ములేక కేసీఆర్ చిల్లర రాజకీయాలు చేస్తారని విమర్శించారు. తన రాజీనామా తర్వాతనే కేసీఆర్ దళితులకు గౌరవం ఇస్తున్నారని అన్నారు. దళిత బిడ్డలను ఏసీ బస్సుల్లో ఎస్కార్ట్ పెట్టి ప్రగతిభవన్‌కు తీసుకువెళ్లారని చెప్పారు. మాజీ ఐపీఎస్ అర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నిర్దాక్షిణ్యంగా బయటకు పంపించారని మండిపడ్డారు. రాజకీయ వ్యవస్థను కేసీఆర్ బోన్‌లో నిలబెట్టాడని ఈటల విమర్శించారు.

# ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

జనగామ, జులై 29 : ఏటీఎం సెంటర్లలో అమాయకులను మోసగించి డబ్బులు డ్రా చేసే ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి వివరాలను వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి లక్షా 60 వేల రూపాయల నగదు, 8 నకిలీ ఏటీఎం కార్డ్స్, రెండు కార్లు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, పరారీలో ఉన్న మరో నిందితుడు కోసం పోలీసులు గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# ఆగస్టు 4న జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం ..!

సంగారెడ్డి, జులై 29 (నేటినిజం ప్రతినిధి) జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఆగస్టు 4న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి. హెచ్. ఎల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఇట్టి సమావేశమునకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు తన్నీరు హరీష్ రావ్ పాల్గొంటారని , పార్లమెంట్ సభ్యులు ,శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ , జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్లు, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ కో ఆప్టెడ్ సభ్యులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

జిల్లా అధికారులు తమ శాఖకు సంబంధించిన సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

# ఆగస్ట్ 16నే స్కూళ్లు ప్రారంభం.. జగనన్న విద్యాకానుక ఇస్తాం: మంత్రి సురేష్




అమరావతి, జులై 29:ఆంధ్రప్రదేశ్ లో ఆగస్ట్ 16న స్కూళ్లు పున:ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. అదే రోజు జగనన్న విద్యాకానుక ఇస్తామని వెల్లడించారు. విద్యాకానుకలో ఈసారి డిక్షనరీ కూడా ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల స్కూళ్లను నాడు-నేడు కింద అభివృద్ధి చేశామని చెప్పారు. మొదటి దశ నాడు-నేడును ప్రజలకు అంకితం చేస్తామన్నారు. అదే రోజు రెండో విడత నాడు-నేడు పనులను కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. స్కూళ్లు ప్రారంభించేలోపు టీచర్లందరికీ వ్యాక్సినేషన్ పూర్తిచేస్తామని మంత్రి సురేష్ స్పష్టం చేశారు.

# బీమాతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా : మంత్రి సత్యవతి రాథోడ్



కుమ్రంభీం ఆసిఫాబాద్, జులై 29:: కార్యకర్తలందరికీ బీమా కల్పించి వారి కుటుంబాల్లో టీఆర్ఎస్ పార్టీ భరోసా నింపిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు తమ రక్షణ కవచంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఇవాళ జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, జిల్లా నాయకులతో కలిసి మంత్రి సిర్పూరు ? కాగజ్ నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాయకులంతా కష్టపడి సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదును పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు సభ్యత్వ నమోదు పూర్తి చేస్తే వచ్చే నెల 1వ తేదీ నుంచే కార్యకర్తలకు బీమా అమలులోకి వస్తుందని తెలిపారు. 50 వేల లక్ష్యం ఇస్తే 48 వేల సభ్యత్వాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. జిల్లా పార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ త్వరలో ప్రారంభిస్తారని చెప్పారు.

# జిల్లాలవారీ సీరం సంబంధ యాంటీబాడీ నిర్ధారణ పరీక్షలు జరపాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ సూచన

న్యూఢిల్లీ, జులై 29:జిల్లాలవారీగా స్థానికంగా రక్తపరీక్షల ద్వారా యాంటీబాడీల నిర్ధారణకు భారత వైద్యపరిశోధనామండలి (ఐసిఎంఆర్) మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే జరపాలని కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. కోవిడ్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు స్పందన తెలియాలంటే ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఎంతమందిలో యాంటీబాడీలు తయారయ్యాయి, ఎంతమందికి కోవిడ్ బైటపడకుండానే వచ్చి నయమైంది లాంటి సమాచారం కోసం ఈ సర్వే అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల అదనపు చీఫ్ సెక్రెటరీ/ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి/ అరోగ్య కార్యదర్శి కి లేఖలు రాశారు.

ఐసిఎంఆర్ జాతీయ స్థాయిలో జరిపిన 4వ రౌండ్ సీరో ప్రివాలెన్స్ సర్వే ఫలితాలను కూడా కేంద్ర ఆరోగ్య కార్యదర్శి తన లేఖలో ప్రస్తావించారు. అదే తరహాలో రాష్ట్రాలు కూడా చేపట్టాలని కోరారు. ఈ సమాచారం ఆధారంగా ఒక ప్రామాణిక ప్రొటోకాల్ రూపకల్పనకు, కోవిడ్-19 విషయంలో ప్రజారోగ్య స్పందనను బేరీజు వేయటానికి వీలవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పారదర్శకంగా ఒక ఆధారంతో కూడిన సమాచారం సంపాదించటానికి ఇది సరైన మార్గమని కూడా పేర్కొంది.

భారత వైద్య పరిశోధనామండలి ఇటీవలే దేశవ్యాప్తంగా 70 జిల్లాలలో జాతీయ సీరో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో తేలిన ఫలితాలు రాష్ట్రాల వారీగా ఇలా ఉన్నాయి.జాతీయ స్థాయిలో కోవిడ్ వ్యాప్తి ఏ మేరకు ఉన్నదో లెక్కించటానికి ఐసిఎంఆర్ ఈ సర్వే ద్వారా సమాచారం సేకరించింది. అయితే, ఈ సమాచారం అన్ని జిల్లాలకూ, అన్ని రాష్ట్రాలకూ వైవిధ్యం చూపుతోంది. ఒక్కోచోట ఒక్కో విధంగా కోవిడ్ సోకిన సమాచారం కనిపిస్తోంది.

# విద్యుత్ ఉత్పాదనను పెంచడం కోసం మరిన్ని అణు విద్యుత్ ప్లాంట్లను కమిషన్ చేయనున్న ప్రభుత్వం - డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 29:విద్యుత్ ఉత్పాదన కోసం మరిన్ని అణు విద్యుత్ కేంద్రాలను ప్రారంభించడానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని , కేంద్ర శాస్త్ర ఉసాంకేతిక శాఖ (ఇండిపెండెంట్ చార్జి), ఎర్త్ సైన్సెస్ శాఖ (ఇండిపెండెంట్ చార్జి), ప్రధాన మంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా సమస్యలు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తూ, మొత్తం 6780 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 22 రియాక్టర్లు పని చేస్తున్నాయని, కెఎపిపి -3 (700 మెగావాట్ల) అన్న రియాక్టర్‌ను 10 జనవరి 2021న గ్రిడ్ తో అనుసంధానం చేయడం జరిగిందని మంత్రి వివరించారు. ఇందుకు అదనంగా, మొత్తం 8000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 10 రియాక్టర్ల (భావిని అమలు చేస్తున్న 500 మెగావాట్ల పిఎఫ్‌బిఆర్ సహా) నిర్మాణం వివిధ దశల్లో ఉందని ఆయన తెలిపారు.

10 దేశీయ 700 మెగావాట్ల ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ల (పిహెచ్‌డబ్ల్యుఆంల)లను వేగంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పాలనాపరమైన ఆమోదాన్ని, ఆర్థిక మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయిన తర్వాత, అనుమతి పొంది పని చేయడం ప్రారంభమైన తర్వాత దేశ అణు సామర్థ్యం 2031 నాటికి 22480 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అణు విద్యుత్‌కు సంబంధించి, నమూనా, ప్రదేశం, నిర్మాణం, ప్రారంభం, కార్యకలాపాల వంటి అన్ని అంశాలకూ అత్యధిక ప్రాతినిధ్యాన్ని, ప్రాముఖ్యతను ఇవ్వడం జరిగింది. విస్తీర్ణత (రిడండెన్సీ) , వైవిధ్యం భద్రతా సూత్రాలను అనుసరించి, లోతైన భద్రతా విధానాన్ని అనుసరించి ఫెయిల్- సేఫ్ లక్షణాలను అణు విద్యుత్ ప్లాంట్ల నమూనాలను రూపొం దించారు. దీనికారణంగా రేడియా ధార్మికత మూలానికి, పర్యావరణానికి మధ్య బహుళ ఆటంకాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యకలాపాలను నిర్దేశిత విధానాల ఆధారంగా ఉన్నత విద్యార్హత, శిక్షణ కలిగిన, లైసెన్స్ పొందిన సిబ్బంది నిర్వహిస్తారు. అణు విద్యుత్ ప్లాంట్లలో పని చేస్తున్న సిబ్బందికి తగిన వ్యక్తిగత భద్రతా పరికరాలు, పర్యవేక్షణ మద్దతును కల్పిస్తున్నారు.

# దళితుల జోలికొస్తే ఉరికించి.. ఉరికించి కొడతాం: టి.రాజయ్య



హైదరాబాద్ , జులై 29:ఈటెల రాజేందర్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే టి.రాజయ్య తీవ్ర విమర్శలు చేశారు. ఏడేళ్లు అధికారాన్ని అనుభవించి అదే అధికారం సహాయంతో దళితులు, దేవాలయాల భూములను ఈటెల కబ్జా చేశారని, ఆయన దళిత ద్రోహి అని ఆరోపించారు. హుజురాబాద్ ఉపఎన్నిక సందర్భంగానే దళిత బంధు పథకం తెచ్చారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను టి.రాజయ్య ఖండించారు. నాగార్జునసాగర్ ఉపఎన్నికకు ముందే ఫిబ్రవరి 10న దళిత బంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఏప్రిల్ 14న అసెంబ్లీలో కూడా ప్రస్తావించారని, అయినా కారుకూతలు కూస్తున్న గోనె ప్రకాశరావు, పద్మనాభరెడ్డిలకు సిగ్గు, శరం లేదని మండిపడ్డారు. దళితుల పట్ల అసభ్యకరంగా, అభ్యంతరకరంగా మాట్లాడుతున్న వీరిద్దరిపై సుమోటో కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మరోవైపు ఈటెలకు కొమ్ముకాస్తున్న మధుసూదన్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని టి.రాజయ్య హితవు పలికారు. ఎవరైనా దళితుల జోలికొస్తే ఉరికించి.. ఉరికించి కొడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏ పథకం అయినా ఆనవాయితీగా కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభిస్తుందని.. ఇప్పుడు దళిత బంధును కరీంనగర్ నుంచి ప్రారంభిస్తామని చెప్పగానే ఈటెలకు చెమటలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు.




# రహదారుల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం

న్యూఢిల్లీ, జులై 29:ఇప్పటివరకు 703 పొడవైన జాతీయ రహదారుల నిర్మాణంలో, పైపొర మిశ్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించారు. జాతీయ రహదారుల పేవ్‌మెంట్ల కాలానుగుణ మరమ్మతులలో ప్లాస్టిక్ వ్యర్థాలను తప్పనిసరిగా ఉపయోగించాలని, 5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణ ప్రాంతాలకు 50 కిలోమీటర్ల పరిధిలో నిర్మించే సర్వీస్ రోడ్లలోనూ ఉపయోగించాలని మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. రహదారుల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వల్ల, పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు తప్పుతుంది.

కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈ సమాచారాన్ని లిఖితపూర్వక సమాధానంగా ఇవాళ లోక్‌సభకు సమర్పించారు.

# తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించండి: ఏపీకి కేంద్రం నోటీసులు

అమరావతి, జులై 29:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేంద్రం షాక్ ఇచ్చింది. పరిమితికి మించి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించాలని నోటీసులు పంపింది. ప్రస్తుతం ఏపీ అప్పుల కుప్పగా మారింది. ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం కూడా అప్పులు వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. పరిమితికి మించి అప్పులు చేయడం, ఆస్తుల తాకట్టుపెట్టి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడంపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెట్టింది. ఈ క్రమంలో పరిమితికి మించి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించాలని నోటీసులు పంపించింది.

2019 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ. 2 లక్షల కోట్ల వరకు అప్పులు తీసుకువచ్చారు. ఇవి కాకుండా రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టి రాష్ట్రాభివృద్ధి కార్పొరేషన్ ద్వారా రూ. 25వేల కోట్ల రుణం తీసుకునేందుకు బ్యాంకుల కన్సార్టియంతో మాట్లాడి.. రూ. 21.500 కోట్లు రుణంగా తెచ్చారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని సవరించినప్పటికీ కూడా ఏపీకి అప్పులు సరిపోవడం లేదు. సాధారణంగా జీఎస్డీపీలో 3 శాతం రుణం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఏపీలో జీఎస్డీపీ ప్రకారం రూ. 30,305 కోట్ల రుణం తీసుకునేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. కోవిడ్ కారణంగా ఆర్థిక పరిస్థితి దెబ్బతినడం, ఆదాయం తగ్గిపోవడంతో అన్ని రాష్ట్రాలకు 2 శాతం అదనంగా అప్పు తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఏపీ ప్రభుత్వం కేంద్రం విధించిన షరతులను అమలు చేసి పెంచిన శాతం మేరకు అప్పులు తీసుకువచ్చింది. కేంద్రం వెల్లడించిన లెక్కల ప్రకారం పెంచిన శాతంతో కలిపి రూ. 49,497 కోట్ల రుణం తీసుకోవల్సి ఉండగా రూ. 54 వేల కోట్ల రుణం తీసుకువచ్చిందని కేంద్రం ప్రకటించింది. ఆర్థిక లోటు కూడా రోజు రోజుకూ పెరిగిపోతుందని, పరిమితికి మించి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించాలని పేర్కొంటూ కేంద్రం ఏపీకి నోటీసులు పంపించింది.

# దళిత బంధు అద్భుత పథకం : ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



రాయికోడ్/సంగారెడ్డి, జులై 29: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పతకం ఎంతో అద్భుతంగా ఉందని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. దీని జిర్నీచుకోలేని ప్రతి పక్ష పార్టీలు అనవసర విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. గురువారం రాయికోడ్ మండల కేంద్రంలో రైతు వేదికను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ గందరగోళం సృష్టిస్తునాయని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై ప్రేమ ఉంటే వారి ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో 20 లక్షలరూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



# దుబ్బాకలో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి హరీష్ రావు



సిద్దిపేట, జులై 29:: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో మంత్రి హరీశ్ రావు ఇవాళ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో నూతన బస్టాండ్ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బాలాజీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం మరో 3 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు ఇస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 90.5 శాతం మందికి రేషన్ బియ్యం అందుతున్నాయని వెల్లడించారు. ఏడాదికి రూ. 2700 కోట్లను ఇందుకు ఖర్చు చేస్తున్నామని అన్నారు.

ప్రతి పేదవారికి రేషన్ బియ్యం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. 'సాగుకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నదని దేశంలో తెలంగాణ సర్కార్ మాత్రమే. పేదింటి ఆడబిడ్డల వివాహానికి కళ్యాణలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ.లక్ష ఇస్తున్నది. సంక్షేమంలో దేశానికి రోల్ మోడల్ తెలంగాణ ప్రభుత్వం' అని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.

అంబేద్కర్, జగ్జీవన్ రామ్ భవనాల నిర్మాణాలకు రూ.కోటి మంజూరు చేస్తామని తెలిపారు.దళిత బంధు పథకం కొత్తగా రాలేదని 2021 అసెంబ్లీ బడ్జెట్‌లోనే ప్రవేశ పెట్టామని గుర్తుచేశారు. దుబ్బాకలో ఈ ఆర్థిక సంవత్సరంలోనే దళిత కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థికసాయం చేస్తామని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో దళిత బంధు పథకాన్ని సమగ్రంగా పూర్తి చేస్తామన్నారు. దుబ్బాకలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నా అభివృద్ధి మాత్రం ఆపబోమని అన్నారు. దుబ్బాకలో అసంపూర్తిగా పనులన్నీ పూర్తి చేస్తామని, నూతనంగా నిర్మించ తలపెట్టిన బస్టాండ్ నిర్మాణానికి మరిన్ని నిధులు కేటాయిస్తామని తెలిపారు. రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, జిల్లా అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# టోక్యో ఒలింపిక్స్ లో మేరీ కోమ్ కథ ముగిసింది..

న్యూఢిల్లీ, జులై 29:ఇండియన్ స్టార్ బాక్సర్, ఆరుసార్లు వరల్డ్ చాంపియన్ మేరీ కోమ్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. మొదటి నుంచి మేరీ కోమ్ మెడల్ తీసుకువస్తుందని అందరూ భావించారు..కాని కొలంబియాకు చెందిన ఇన్‌గ్రిట్ విక్టోరియా చేతిలో 2-3 తేడాతో మేరీ కోమ్ ఓడిపోయింది. తొలి రౌండ్‌లోనే విక్టోరియా ఎదురుదాడికి దిగడంతో మేరీ కోమ్‌కు కోలుకునే అవకాశం దక్కలేదు. మెడల్‌పై ఆశలు రేపిన ఆమె రౌండ్ ఆఫ్ 16లోనే ఇంటిదారి పట్టింది. తొలి రౌండ్‌లో నలుగురు జడ్జీలు విక్టోరియాకు 10 స్కోర్లు ఇచ్చారు. అయితే రెండో రౌండ్‌లో మేరీ పుంజుకొని ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. కీలకమైన మూడో రౌండ్‌లో మరోసారి విక్టోరియా ఎదురుదాడికి దిగడంతో మేరీ కోమ్‌కు ఓటమి తప్పలేదు

# ప్రీక్వార్టర్స్‌లోకి ఆర్చర్ అతాను దాస్



టోక్యో, జులై 29:: భారత ఆర్చర్ అతాను దాస్ ప్రీక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. రెండుసార్లు గోల్డ్ మెడల్స్ సాధించిన దక్షిణ కొరియా ఆర్చర్‌పై సంచలన విజయం నమోదుచేశాడు. పురుషుల వ్యక్తిగత విభాగం 1/16 ఎలిమినేషన్స్‌లో దక్షిణ కొరియా ఆటగాడు ఓ జిన్ హయాక్‌తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 5-6 తేడాతో గెలుపొందాడు. కాగా, మ్యాచ్ సమయం ముగిసే సరికి ఇరువురి స్కోర్లు సమం కావడంతో షూట్ ఆఫ్ నిర్వహించారు. ఇందులో అతాను దాస్ పైచేయి సాధించి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించాడు. దాస్ సతీమణి ఆర్చర్ దీపికా కుమారి ఇప్పటికే మహిళల వ్యక్తిగత విభాగం ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. కాగా, అంతకుముందు జరిగిన ఎలిమినేషన్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ ఆర్చర్ డెంగ్ యు చెంగ్‌పై 4-6 తేడాతో అతాను దాస్ విజయం సాధించాడు.

# మ్యాచ్‌కు ముందు ప్లేయర్‌ను లాగిపెట్టి కొట్టిన కోచ్..

టోక్యో,జులై 29: ఒలింపిక్స్‌లో ఓ జూడో మ్యాచ్‌లో తలపడటానికి జర్మనీకి చెందిన జూడో స్టార్ మార్టినా ట్రాడోస్ కోచ్‌తో కలిసి వస్తోంది. ఆమె రింగ్‌లోకి వెళ్లే ముందు తన వెంటే ఉన్న కోచ్ రెండు చేతులతో కాలర్ పట్టుకొని లాటి రెండు చెంపలపై వాయించాడు. ఇది చూసిన వాళ్లంతా షాక్ తిన్నారు. కెమెరాల ముందే ఈ కోచ్ ఏంటి ఇలా చేస్తున్నాడని అంతా ముక్కున వేలేసుకున్నారు. అయితే ఆ చెంపదెబ్బలు తిన్న మార్టినా మాత్రం ఇది కామనే అని చెప్పడం విశేషం. ఫైట్‌కు ముందు కోచ్ ఇలా చేయడం ఆనవాయితీ అని ఆమె చెప్పడం మరింత షాక్‌కు గురి చేసింది. అది కూడా తాను చెప్పడం వల్లే కోచ్ అలా చేస్తున్నాడని మార్టినా చెప్పింది. ఫైట్‌కు ముందు తాను యాక్టివ్‌గా ఉండటానికి ఇది తనకు అవసరం అని ఆమె అనడం విశేషం. అయితే ఈ వీడియో చూసిన సోషల్ మీడియా యూజర్లు కోచ్‌పై మండిపడుతున్నారు.

# పాలమూరులో రూ.300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన



మహబూబ్‌నగర్, జులై 29: పాలమూరులో రూ. 300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పాత కలెక్టరేట్ స్థానంలో 10 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించనున్న దవాఖానను ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రజలందరికి ఉపయోగపడే విధంగా నిర్మిస్తామన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్ సైతం ఆమోదం తెలిపారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులతో పాత కలెక్టరేట్ పరిసరాలను, కలెక్టరేట్ భవనాన్ని మంత్రి పరిశీలించారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించేందుకు సీసీఎల్ఏ అనుమతి కూడా వచ్చిందని, కొత్త కలెక్టరేట్ లోకి మారక ముందే పాత కలెక్టరేట్ ను మెడికల్ కళాశాల డైరెక్టర్ కు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. పాత కలెక్టరేట్ లోనే 3 ఎకరాలలో రైతు బజార్, జనతా క్యాంటీన్ నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

పాత కలెక్టరేట్ భవనంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించడం వల్ల ఉమ్మడి జిల్లా ప్రజలందరికీ సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఎదురుగానే బస్టాండు, చెంతనే రైల్వేస్టేషన్ ఉండటం వల్ల రోగులు, వారి బంధువులకు ప్రయాణానికి ఇబ్బందులు ఉండబోవన్నారు. అలాగే పట్టణంలో బస్టాండ్ నుంచి సూపర్ స్పెషలిటీ ఆసుపత్రికి వచ్చేందుకు రెండు ఫుట్ ఓవర్ వంతెనలు నిర్మిస్తామన్నారు.

పట్టణమంతా 5 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ దవాఖానలో 6 ఫ్లోర్ తోపాటు, 4 బ్లాకులను నిర్మిస్తున్నామని, ఎన్ని వాహనాలు వచ్చినా ఇబ్బంది లేకుండా పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని అధికారులు సూపర్ స్పెషాలిటీ దవాఖాన భవన నిర్మాణానికి మంచి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

చరిత్రలో నిలిచిపోయేలా సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

దళారుల బెడద లేకుండా ప్రభుత్వం పథకాల లబ్ధిదారులకు అందాలన్నారు. ఒకవేళ సంక్షేమ పథకాలలో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహ రుజువైతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా అన్ని వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలు ఇస్తున్నామన్నారు.

అంతకు ముందు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పాత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న డీఆర్డీవో భవనాన్ని, అక్కడి పరిసరాలను మంత్రి పరిశీలించారు. డీఆర్డీవో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నందున వెంటనే దాన్ని ఖాళీ చేయాల్సిందిగా మంత్రి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు తేజస్ నందలాల్ పవార్, కె. సీతారామారావు, డీఆర్ఓ స్వర్ణలత, మెడికల్ కళాశాల డైరెక్టర్ డా. పుట్టా శ్రీనివాస్, జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డా. రాంకిషన్, డీఎంహెచ్ఓ డా.కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ తదితరులు హాజరయ్యారు.

# అక్షర సేద్యకారుడు..... సినారె

## - ఘనంగా సినారె జయంతి వేడుకలు..



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): కవిసామ్రాట్, విశ్వంభరుడు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ప్రముఖ తెలంగాణ సాహితీ వేత్త సింగిరెడ్డి నారాయణరెడ్డి సినారె 90వ జయంతి సందర్భంగా వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు ఆధ్వర్యంలో ఎ ౦ న ౦ గ ా నిర్వహించడంజరిగింది. ముందుగా సినారే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా ఎంపీమాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు కొన్ని వేల ఆణిముత్యం లాంటి అద్భుత పాటలు అందించి సినీ పరిశ్రమలో చెరగని ముద్ర చాటుకున్నారని కొనియాడారు. విశ్వంభరతం తో తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన జ్ఞానపీఠ్ అవార్డు తెలుగు ప్రజలకు అందించే మహోన్నతమైన విజ్ఞానాన్ని అంది పుచ్చుకున్నట్టు వివరించారు ఆయనే మనమధ్య భౌతికంగా లేకపోయినా ఆయన రాసిన గేయాలు పద్యాలు కవితలు ఉన్నంతవరకు సినారె మన మధ్యలో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు జడ్పీటీసీ మ్యాకల రవి , మార్కెట్ కమిటీ అధ్యక్షులు గడ్డం హన్మాండ్లు, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు వి. వనపర్తి దేవరాజు,సంకెపల్లి సర్పంచ్ సునీత వేణు,ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీడీఓ నరేష్ ఆనంద్, ఎంపీఓ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ఘనంగా సినారె జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు గురువారం వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు .శ్రీ నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి కళాకారులు సినారె రాసిన గీతాలను కవితలను ఆలపించడం జరిగింది. అనంతరము కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పో శెట్టి మాట్లాడుతూ హనుమాజీపేట కళామతల్లి ముద్దుబిడ్డ మాజీ రాజ్యసభ సభ్యులు రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత స్వర్గీయ డాక్టర్ సి.నారాయణరెడ్డి 90 వ జయంతి కార్యక్రమం ఘనంగా జరుపుకోవడం జరిగిందని , సినారె కవిగా సినీగీతాల రచయితగా పలు సాహిత్య ఉన్నత శిఖరాలను అధిరో హించాడు అన్నారు. ప్రక్రియలను .గజల్ వంటి ఉర్దూ సాహితీసాంప్రదాయానికి గౌరవం ఇచ్చారన్నారు తెలుగు సాహిత్యాన్ని విశ్వ వ్యాప్తం చేసిన డాక్టర్ సినారె తెలంగాణ భాష సాహిత్యం సాంస్కృతిక కళారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గంగా శ్రీకాంత్ కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ గౌరవ అధ్యక్షులు సామినేని బాలు, గ జిల్లా కళాకారుల రంగస్థల అధ్యక్షులు బొడ్డు రాములు ,ప్రధాన కార్యదర్శి కీసర నరసింగం, పావన పెల్లి శ్రీనివాస్ ,కనగర్తినరసయ్య ,కనగర్తి బాబు రాధిక మేడం, ప్రమోద్, శ్రీకాంత్, గుండం అనిల్ ,సాయి హర్షిత్, తదితరులు పాల్గొన్నారు

# బెంగాల్‌లో ఆగస్ట్ 15 వరకూ కొవిడ్-19 నియంత్రణల పొడిగింపు

కోల్‌కతా, జులై 29:పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆగస్ట్ 15 వరకూ కొవిడ్-19 నియంత్రణలను పొడిగించింది. జులై 31 నుంచి నూతన లాక్‌డౌన్ మార్గదర్శకాలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19 నియంత్రణలను కొన్ని సడలింపులతో ఆగస్ట్ 15 వరకూ పొడిగించినట్టు పేర్కొంది. ప్రభుత్వ కార్యక్రమాలను ఇండోర్‌లో 50 శాతం సీటింగ్ సామర్థ్యంతో నిర్వహించేందుకు అనుమతించింది.

ఇక రాత్రి కర్ఫ్యూ ప్రతిరోజూ రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఐదు గంటల వరకూ అమల్లో ఉంటుందని పేర్కొంది. సగం సీట్లతో బస్సులు, ట్యాక్సీలు, రిక్షాల రాకపోకలకు వెసులుబాటు కల్పించింది. 50 శాతం సిబ్బందితో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు పనిచేస్తాయని పేర్కొంది. కొవిడ్-19 నిబంధనలను కఠినంగా అమలు జరిగేలా చూడాలని జిల్లా యంత్రాంగాలను బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హెచ్‌కే ద్వివేది కోరారు.

# జర్నలిస్టులకు మంజూరైన నివేశన స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలి..

## అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి...

### -టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన నివేశన స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా స్థానిక తహశీల్దార్ మునీందర్ ను కోరారు. గురువారం రోజున వేములవాడ అర్బన్ తహశీల్దార్ మునీందర్ ను కలిసి జర్నలిస్టుల సమస్యలు, నివేశన స్థలాల హద్దులు, ఇళ్ల స్థలాలు మంజూరు కానీ జర్నలిస్టు కోసం నివేశన స్థలాల మంజూరి గురించి చర్చించారు. వేములవాడ మున్సిపాలిటీ నాంపల్లి పరిధిలోని 391 సర్వేనెంబర్ లో సుమారు56 మంది జర్నలిస్ట్ లకు నివేశన స్థలాలు కేటాయించినట్లు ప్రభుత్వం ద్వారా పట్టాలు అందించిన అధికారులు హద్దులు ఏర్పాటు చేయక పోవడం తో జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దంన్నర కాలంగా జర్నలిస్టులుగా పని చేస్తున్న మరికొంత మంది జర్నలిస్టులకు అనివార్య కారణాల వల్ల నివేశన స్థలాలు మంజూరు కాలేదని వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహశీల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు .జర్నలిస్ట్ ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ మునీందర్ ను లాయక్ పాషా కోరారు.

# ఇండియన్ కిసాన్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కుమ్మరి శంకర్ నియామకం



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): ఇండియన్ కిసాన్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గా నియమితులైన కుమ్మరి శంకర్ ఇండియన్ కిసాన్ యూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి గా వేములవాడ పట్టణానికి చెందిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర దళిత మోర్చ ప్రధాన కార్యదర్శి శ్రీ కుమ్మరి శంకర్ నియమితులైయ్యారు. ఈ మేరకు ఇండియన్ కిసాన్ యూనియన్ జాతీయ అధ్యక్షులు , మెంబర్ అడ్వైసర్ ఎఫ్.ఏ.ఎఫ్ మినిస్ట్రీ ఆఫ్ ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ , గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రామ్ కుమార్ వాలియ నియామక పత్రాన్ని జారీ చేశారు . ఈ సందర్భంగా కుమ్మరి శంకర్ మాట్లాడుతూ రైతు సమస్యల పై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు .

# డ్యూరోఫ్లెక్స్ మొట్టమొదటి ప్రచారకర్తగా అలియా భట్

## మెరుగ్గా నిద్రించడంలో తోడ్పడేందుకు డ్రీమ్ టీమ్




హైదరాబాద్ , జులై 29: భారతదేశ అగ్రగామి స్లీప్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన డ్యూరోఫ్లెక్స్ యువతకు ప్రతీక అయిన అలియా భట్ ను తమ మొట్టమొదటి ప్రచారకర్తగా ప్రకటించింది. 50 ఏళ్లకు పైగా నైపుణ్యంతో కూడిన ఈ విశ్వసనీయ స్లీప్ సొల్యూషన్ బ్రాండ్ తమ తదుపరి క్యాంపెయిన్ ను ఆమెతో ప్రారంభించనుంది, మరింత మెరుగ్గా నిద్రించేందుకు భారతదేశానికి స్ఫూర్తినందించనుంది.

నటి అలియా తన బహుముఖ ప్రతిభకు, అవార్డులు పొందిన పనితీరుకు, ఉత్కృష్టత సాధించేందుకు గల కట్టు బాటుకు పేరొందారు. నిరంతరం ఆమె హద్దులను అధిగమిస్తూ ముందుకెళ్తూ వచ్చారు. నూతన శిఖరాలను అధిరోహించారు. అదే సమయంలో వృత్తిపరమైన విజయాలను, వ్యక్తిగత ఆరోగ్యాన్ని సమతుల్యం చేసుకుం టూ వచ్చారు. తన ఆరోగ్యదాయక జీవనశైలికి ప్రశాంత నిద్ర కారణమని ఆమె పరిగణిస్తుంటారు. సామాజిక మాధ్యమాల్లో సైతం నిద్ర పట్ల తన ప్రేమను చాటుకుంటూ ఉంటారు. అలియా కు నిద్ర పట్ల గల ఆరాధనా భావం ఆమెను డ్యూరోఫ్లెక్స్ కు పరిపూర్ణ ప్రచారకర్తగా మార్చింది. ఈ సందర్భంగా డ్యూరోఫ్లెక్స్ సీఎంఓ స్మితా మురార్క మాట్లాడుతూ, "స్లీప్ సొల్యూషన్స్ విభాగంలో అత్యంత నైపుణ్యంగల సంస్థ డ్యూరోఫ్లెక్స్. భారత్ కు మెరుగైన రీతిలో నిద్రపోయేందుకు తోడ్పడాలన్న కార్యాచరణను అది చేపట్టింది. నూతన తరం వినియోగదారులతో మేము ఏకం కాగల విధంగా కలసి పని చేయాలని మేం కోరుకుంటున్నాం. అలియా భట్ తిరుగులేని విధంగా యూత్ ఐకాన్. తనకు తానుగా ఉన్నత స్థాయికి చేరు కున్నారు. ఆరోగ్యదాయక జీవనశైలిలో నిద్ర కీలకపాత్ర పోషిస్తుందని ఆమె అంటున్నారు. నిద్రపై మేం పంచు కున్న కట్టుబాటును ఆమె ద్వారా యావత్ దేశంలో ప్రచారం చేయాలని భావిస్తున్నాం" అని అన్నా రు. ఒత్తిళ్లతో నిండిన నేటి వాతావరణంలో నిద్ర రాజీపడుతోంది. ఈ నేపథ్యంలో మెరుగైన నిద్రను అందించే మ్యాట్రెసెస్ వంటి అవసరమైన ఉత్పాదనలను ఎంచుకోవడంలో భారత్ అప్ గ్రేడ్ కావడాన్ని ప్రోత్సహించాలని డ్యూరో ఫ్లెక్స్ కోరుకుంటోంది. పరిశోధనల ఆధారంగా, సాంకేతికంగా ముందంజలో ఉండే విధంగా మ్యాట్రెసెస్ ను, స్లీప్ యాక్సెసరీస్ ను ఈ బ్రాండ్ అందిస్తోంది.

# కాగ్నిజెంట్‌లో కొత్తగా లక్ష ఉద్యోగాలు..

న్యూఢిల్లీ, జులై 29:వివిధ ఐటీ సంస్థలు కొత్త వారికి భారీగా కొలువులు ఇచ్చేందుకు సన్నద్ధం అవుతున్నాయి. తాజాగా అమెరికా ఐటీ జెయింట్ కాగ్నిజెంట్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష మందిని నియమించుకోవాలని భావిస్తున్నది. ఐటీ సర్వీసులు, బీపీవో రంగాల్లో ప్రతిభావంతులైన నిపుణులను నియమించుకునేందుకు కసరత్తు చేస్తున్నది.

జూన్ నెలాఖరు నాటికి కంపెనీలో మూడు లక్షల మంది పై చిలుకు ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంపన్సేషన్ అడ్జస్ట్‌మెంట్లు, జాబ్ రొటేషన్లు, రీ స్కిలింగ్, ప్రమోషన్లు చేపట్టనున్నట్లు కాగ్నిజెంట్ తెలిపింది.

# చంద్రశేఖర్ ఆలయ ఉద్యోగా.. టీఆర్ఎస్ కార్యకర్తనా..!

## -సోషల్ మీడియాలో టిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పోస్టులు

## -చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్

రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా పేరుగాంచి నసుప్రసిద్ధ వేములవాడ రాజన్నఆలయ ఉద్యోగి ఉపాధ్యాయుల చంద్రశేఖర్ అధికార టిఆర్ఎస్ పార్టీ కి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ తన ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతలకు కళంకం తీసుకొచ్చాడని ఆయనపై ఉన్నతాధికారులు తక్షణమేచర్యలు తీసుకోవాలి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆలయ ఈవో కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఒక ఉద్యోగి అయి ఉండి ఎమ్మెల్యే అండతో సామాజిక మాధ్యమాల్లో టిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పోస్టులు పెడుతూ టీఆర్ఎస్ నాయకుడిలాగేవ్యవహరిస్తున్నాడని , ఈ క్రమంలో తమ నాయకుడు ఆది శ్రీనివాస్ ప్రెస్ మీట్ లో మాట్లాడిన మాటలను పోలీసువారికి చెప్పి తొలగించాలని కోరడం జరిగిందని ఒక ఆలయ ఉద్యోగి ఇలా వ్యవహరించడం ఏంటని అతనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు . ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్ జిల్లా కార్యదర్శి చిలుక రమేష్ , చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ , కూరగాయల కొమురయ్య , అరుణ్ తేజ చారి , బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాము గౌడ్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ పట్టణ ఉపాధ్యక్షులు వస్తాది కృష్ణ కార్యదర్శి లింగం పెల్లి కిరణ్ , దాడి మల్లేశం వనపర్తి శంకర్ , గేంటల ప్రకాష్ , మేండే రాజు , మర్రి పెల్లి రాజు , నాగుల మహేష్ తదితరులు ఉన్నారు.



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.